
# క్రిస్మస్

కౌటికబారి




పంధ'మ్మిది వందల అరవై ఆరు సంవత్సరాల పూర్వం, మంచు కురుస్తున్న సమయంలో, బెత్లహేమ్ పట్టణంలో, దైవానుగ్రహం వల్ల, మేరీ జోసఫ్ దంపతులకు, పశువుల పాకలో— ఉదయించే సూర్యుణ్ణి చూడటానికి, చీకటిలో క్రొత్త వెలుగై— క్రీస్తు జన్మించాడు.

ఆశాజ్యోతినీ, జయంతినీ, వెంటబెట్టుకుని మిత్రులకూ, బంధువులకూ పొరుగువారికీ క్రిస్టమస్ గ్రీటింగ్ కార్డ్సు ఇచ్చి, నిండు నెలల మేరీ ఇంటికి తిరిగి వచ్చేసరికి, క్రిస్టమస్ ట్రీ దగ్గర కూర్చుని, తదేకంగా చెట్టులోకి చొచ్చుకుపోయిన చూపులతో వున్న జోసఫ్ మనస్సులో ఏమేమో వూహించుకొంటూ వున్నాడు.

భార్య తృప్తిగా లోపలికి పోయింది. పిల్లలు ప్రేమగా తండ్రి దగ్గరకు చేరారు. ఆశాజ్యోతి పెద్ద పిల్ల. ఎనిమిదేళ్ళు! జయంతి రెండోబిడ్డ. వాలుగేళ్ళు!

కూతుళ్ళ నిద్దర్నీ రెండు చేతుల క్రిందికి తీసుకొని వరండాలోకి వచ్చేసరికి బిలబిలలాడుతూ పదిమంది పిల్లలు 'సార్! సార్!' అంటూ ప్రహరీ తలుపు నెట్టుకొని లోపలికి వచ్చి, చుట్టూవున్న పూలమొక్కలు పరిశీలించి చూస్తూ వరండాలోకి వచ్చి రంగు కాగితాల అలంకరణ చూస్తూ నిలబడిపోయారు. వాళ్ళ వెనుక టీచర్ వచ్చాడు.

'సార్, మేం నాటకం వేస్తున్నాం సార్!' ఉన్నట్టుండి అంతా ఒక్కసారి చెప్పారు.

'ఏం నాటకం?'

'క్రీస్తు పుట్టుక!'

'ఎప్పుడు?'

'రేపు సాయంకాలమ్'

'బాగుంది!'

'నేను హేరోడ్ సార్'

'పనికొస్తావ్. దూకుడుగానే వున్నావ్'

'నేను జోసఫ్ సార్!'

'బాగున్నావు!'

'నేను మేరీసార్' సన్న గొంతుక చిన్నపిల్లాడు చెప్పాడు.

ఆ కుర్రాణ్ణి ముద్దుపెట్టుకొన్నాడు జోసఫ్.

'నేను దేవదూత!'

'మేం గొర్రెలకాపరులు!'

'మేం జ్ఞానులు!'

'మరి క్రైస్ట్ ఏడీ?'

జోసఫ్ ప్రశ్నించాడు.

'క్రీస్తు? — లేడు— టాయ్‌క్రైస్ట్ సార్'

జోసఫ్ నవ్వుకున్నాడు.

వాళ్ళంతా ప్రైమరీ స్కూలు పిల్లలు. వాళ్ళ టీచర్ చందా అడిగాడు. ఎవరెంత ఇచ్చారో......

'జ్ఞానానందంగారు పది, దేవదానంగారు పది, క్రిస్టోఫర్‌గారు పాతిక, నయోమిగారు అయిదు, ఆనందరావుగారు ఏడు, సుందర్రావుగారు మూడు...' చెప్పుకుపోతున్నాడు టీచర్.

'నన్నెంత ఇమ్మంటారు'

'దేవుని చిత్తం, మీ యిష్టం!'

'మీరు చెప్పండి!'

'మీయిష్టం సార్. మీకు తెలియందేముంది?'

'పది ఇచ్చేదా?'

'మీ యిష్టం!'

మేరీ వరండాలోకి అప్పుడే వచ్చింది. పది రూపాయల కాగితం తెచ్చింది. భర్తకిచ్చింది. తన మనస్సులో మాట గ్రహించిందా మేరీ అనిపించిందా క్షణంలో జోసఫ్‌కి.

ఆ రోజు శనివారం. తెల్లవారితే ఆదివారం. క్రిస్టమస్. చాలా అరుదుగా డిసెంబరు ఇరవై అయిదో తారీఖు— క్రిస్టమస్— ఆదివారం అవుతుంది. అందుకెంతో ఆనందంగా వుంది.

ఆ మధ్యాహ్నం అందరూ తల స్నానం చేశారు. ప్రార్థన చేసుకున్నారు.

జోసఫ్ హెడ్‌మాష్టర్. మేరీ. బి. ఇడి. అసిస్టెంట్. ఇద్దరికీ మిషన్ స్కూల్‌లో ఉద్యోగాలు.

పదేళ్ళక్రితం పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు కలిగారు.

దగ్గరున్న కూతుళ్ళు ఇంట్లోకి వెళ్లిపోయాక అతను భార్య ముఖంలోకి చూశాడు. నిండు నెలలతోవున్న ఆమె తల స్నానంచేసి క్రొత్తబట్టలు

కట్టుకొని పరిశుభ్రంగా వున్న ఆమె, వెలిగించిన క్రొవ్వు వత్తిలాగా కనిపించింది.

ఆనంద పారవశ్యంతో చూస్తుంటే, సిగ్గుతో క్రొత్త పెళ్ళి కూతురులాగా కుంచించుకుపోయింది. ఏండు నెలల మేరీ.

'ఏమిటండోయ్, అదేం పద్ధతి. నాకేం నచ్చలేదు.' జోసఫ్ నవ్వాడు.

'చాల్లెండి.'

ఆమె నవ్వుతూ లోపలికి పోయింది.

స్కూలులో పనిచేసే తెలుగు మాష్టరూ, డ్రిల్లు టీచరూ వచ్చారు. ఏదో సిచ్చాపాటీ అయింది. గ్రీటింగ్ కార్డ్సు ఇచ్చి వెళ్ళిపోయారు.

ఈ గ్రీటింగ్ కార్డ్సు ఇచ్చిపుచ్చుకోవటాలు బహుశా భారతీయతకాదు. ఆంగ్ల సంస్కారం!

జోసఫ్‌కు ఒక్కతే చెల్లి. అన్నదమ్ముళ్లు లేరు. ఇక అక్కచెల్లెళ్ళు లేరు. చెల్లి పెళ్ళి అయిపోయింది. అతను హెడ్‌మాష్టరు అయ్యాక పల్లెనుంచి తల్లి వచ్చి కొడుకు దగ్గరే పట్టణంలో వుండిపోయింది.

కుటుంబం పట్ల తన బాధ్యత చక్కగా నెరవేర్చాడు. ఆ ఆనందం వుంది.

అనుకూల్యవతి భార్య. రాశీ భూత సౌందర్య దీపికలు పిల్లలు. మూర్తి దాల్చిన అనురాగం అమ్మ.

ఆ తృప్తి వుంది.

తనకు ఆస్తి వుంది. భార్యకు ఎంతో ఆస్తి వచ్చింది. మంచి ఉద్యోగాలు! ప్రశాంత జీవితం! ఏచీకూ చింతా కనిపించదు.

కానీ, అన్నివున్నా, జోసఫ్‌కి ఒకటే దిగులు. ఎవరితోనూ ఎప్పుడూ చెప్పుకోలేదు. చెప్పుకోలేడు.'' తనకు మగపిల్లవాడు కలగాలి.

డ్రాయింగ్ రూంలో టేబిల్ మీద వున్న క్రిస్టమస్ ట్రీ దగ్గరకు మళ్ళీ చేరాడు.

అది సరివి మొక్క. రంగురంగుల జిలుగు జలతారు దారాలతో, పలురంగుల చిన్ని చిన్ని బల్బులతో, గ్రీటింగ్ కార్డ్సుతో, రంగు కాగితాలతో ఎంతో అందంగా వుంది క్రిస్టమస్ ట్రీ.

క్రీస్తు పుట్టుకతో గానీ, జీవితంతోగానీ, క్రిస్టమస్ ట్రీకి ఏం సంబంధం వుందో బైబిల్ తెలపలేదు.

అదొక ఆచారం. అనూచానంగా వస్తున్న సంప్రదాయం.

ఆ ఆకుపచ్చరంగు మొక్క సంతోషానికి చిహ్నం కావచ్చు.

వెలుగులు వెదజల్లుతూ, మెరిసిపోతూవున్న ఆ మొక్క, క్రీస్తు కాంతితో వెలుగొందిన పశువుల పాకలోని పచ్చిగడ్డికి చిహ్నంకావచ్చు.

మొక్క క్రైస్తవమతమైతే, దానిలోని చీలికలు మొక్కలోని శాఖలు కావచ్చు. శాఖోపశాఖా శాఖికలు కావచ్చు.

చిన్ని దేశానికి పరిమితమైన ఒకానొకనాటి చిన్ని క్రైస్తవ మతం, చిన్ని మొక్కగా వూహింపబడి, అది పెరిగి పెద్దదయి, విశాల విశ్వంలో ఆశాంతరాళాలు తాకాలనే ఆశకూ, పెరిగి పెద్దదై దేశదేశాలకూ ప్రాకాలనే కోర్కెకూ చిహ్నంకావచ్చు.

క్రిస్టమస్ ట్రీ, ఆనందానికి సంకేతమో, నిక్షిప్తానంతార్థమో తెలియదు కాని, మతంతో పెనవేసుకు పోయిన బాధారహితాచారం.

గోడగడియారం అయిదుకొట్టింది.

'షాపింగ్‌కు పోదామన్నారు కదూ!'

మేరీ వచ్చింది. గుర్తుచేసింది. జోసఫ్ బట్టలు వేసుకున్నాడు.

అమ్మకూ, పనిమనిషి సువార్తమ్మకూ పిల్లల్ని అప్పజెప్పి, బయలుదేరాడు జోసఫ్ భార్యను వెంటబెట్టుకుని.

ఏవేవో తీసుకుని, పార్శిల్ చేయించి, వాటి మీద పేర్లు వ్రాయించి, తీసుకొని యింటికి బయలుదేరారు.

అవి క్రిస్టమస్ ట్రీ చుట్టూ పెట్టారు.

భోజనాల దగ్గర పిల్లలిద్దరూ క్రిస్టమస్ ఫాదర్‌ను గూర్చి చెప్పమని అడిగారు.

'పడుకొనేటప్పుడు చెబుతానులే' అన్నాడు.

పడుకోబోతూ తల్లితో చెప్పాడు.

'కారెల్ పార్టీ వచ్చిందాకా నన్ను లేపవద్దు. మూడు రోజుల్నుంచి నిద్రలేదు.'

'సరేలేరా పడుకో!'

తల్లి చెప్పింది.

పిల్లలిద్దరూ ఒక మంచం మీద, పక్కనే మరో మంచం మీద జోసఫ్.

ప్రక్కగదిలో మేరీ, అమ్మ, సువార్తమ్మ.

పిల్లల్ని చిచ్చికొడుతూ జోసఫ్ చెప్పటం ప్రారంభించాడు.

''కొందరు క్రిస్టమస్ ఫాదర్ అంటారు. కొందరు క్రిస్మస్ తాత అంటారు.

ఆ తాత ఎప్పుడూ భూమ్మీదే వుంటాడు. ఎవరికీ కనిపించడు. అందరికీ మేలు చేస్తాడు. మేలు మాత్రమే కనిపిస్తుంది.

తాత అంటే ఆశ, ఆకాంక్ష, మంచితనం, సౌజన్యం, నిరీక్షణ, అపేక్ష, సౌందర్యం, దైవత్యం.

తాతలో ప్రేమ, ఆప్యాయత, ఆదరణ సంరక్షణ ఉన్నాయి.

తాత అంటే మీకు గౌరవం, భక్తి ఆసక్తి అభిమానం ఉండాలి.

తాత గాలి తోలినట్లు వస్తాడు. వెలుతురు ప్రవేశించినట్లు వస్తాడు. ఆనందంలాగా వుంటాడు. సంతోషంలాగా స్పృశిస్తాడు.

ఆకాశంలోంచి నడిచి వస్తాడు. సముద్రం మీద పరుగెత్తి వస్తాడు. ఎక్కడ చిన్న పిల్లలున్నారో, చిన్న పిల్లల మనస్సుగలవారు ఉన్నారో వాళ్ళందరి దగ్గరకూ, క్రిస్టమస్ రాత్రి వస్తాడు. అందర్నీ చూస్తాడు. ముద్దిడుకొంటాడు. వాళ్ళ మనస్సుల్లో ఉన్న కోర్కెలు కనిపించకుండా తీర్చిపోతాడు.

చల్లని వెన్నెలలాగా, మరీ చల్లని మంచులాగా చలిగాలి రివటలాగా, ఆనందవార్తలాగా, అమృత ప్రవాహంలాగా, ఎప్పుడోవచ్చి, మనల్ని అందర్నీ చూచి, తృప్తిగా గాలి పీల్చుకొని, ఎక్కడెక్కడో వున్న పసివాళ్ళకోసం వెళ్ళిపోతాడు.

చిన్ని మబ్బుముక్క మీదో, లేడిపిల్ల మీదో, క్రొవ్వొత్తి వెలుతురులాగో, క్రిస్టమస్ ట్రీ రూపంలోనో, రంగుకాగితాల ఆకారంలోనో వస్తాడు. ఆకాశంలోని చిరునవ్వడి తాత. భూమ్మీదితొలివేకువతాత. గుండెల్లోని ఆనందం తాత.

క్రిస్టమస్ ఫాదర్ కోసం ప్రతి యేడూ నిరీక్షిస్తూ వుండటమే జీవితం.''

చెప్పటం ముగించిం తర్వాత పిల్లలు అడిగారు.

'తాత మాకేమైనా తెస్తాడా?'

'తెస్తాడు.'

'మాకేం కావాలో తాతతో చెప్పలేదుగా.'

'చెప్పకపోయినా తెస్తాడు. మీకు కావలసిందే తెస్తాడు. కిటికీలు, తలుపులు మూసివున్నా లోపలికి వస్తాడు. మిమ్మల్ని చూస్తాడు. మీరు నిద్రపోతున్నా చూస్తాడు. మీరు తాతను చూడవచ్చు. మామూలు నేత్రాలతో కాదు, మనోనేత్రాలతో. మీ వస్తువులు ఇంట్లో ఎక్కడో వుంచిపోతాడు. మామూలు నేత్రాలతో, తాత తెచ్చిన వస్తువుల్లో తాతను చూస్తారు. తాత ప్రేమను చూస్తారు. తల్లిదండ్రుల ప్రేమ వంటి, క్రైస్తవ సోదరసోదరీ ప్రేమవంటి తాత ప్రేమను చూస్తారు.'

కోటి ఆశలతో కలలుగంటూ పిల్లలిద్దరూ నిద్రాదేవి ఒడిలో ఒరిగిపోయారు.

జోసఫ్ ఆలోచనలతో నిద్రపోలేదు.

రేపు చర్చిలో పాష్టర్, క్రొత్త నిబంధనలో లూక్ 2:1 నుంచి, 2:20 వరకో, మాథ్యూ1:18 నుంచి 2:12 వరకో, రెండూనో చదువుతాడు.

క్రీస్తు పుట్టుకను గూర్చి చెబుతాడు.

అది ప్రతి యేడూ వింటున్నాడు. ప్రతిసారీ క్రొత్తగానే వుంటుంది.

ఏడాదినాటి జోసఫ్ కాదు తనీనాడు. పోయినేటి సమాజం కాదు, ఈ ఏటి సమాజం.

మనిషిలో, సమాజంలో వచ్చిన మార్పు వల్ల పాత విషయంతోనే క్రొత్త అందం ధ్వనిస్తుంది.

జోసఫ్ పశువుల పాక వూహించుకో సాగాడు.

పశువుల పాకలో జనం. కాళీలేదు. పశువులు గడ్డి మేసే తావు. తొట్టిలాగా వుంది. అక్కడ మేరీ కూర్చుంది.

అక్కడ క్రీస్తు పుట్టాడు. ఆకాశంలో నక్షత్రం పుట్టింది. దేవదూత ఆవార్త ఎందరికో అందించింది.

మంచు పడుతూ వుంది. వెన్నెల కాస్తూ వుంది. నక్షత్ర మయూఖాలు వెల్గులు వెదజల్లుతున్నాయి.

కొండల మీద, లోయల్లో, పసిరిక మీద, మైదానాల్లో ఎన్నో చోట్ల మంచుపడింది.

మంచు తెలుపుదనం మీద, చంద్రకాంతి తెలుపుదనం పడి, సృష్టి అంతా తెల్లగా అయిపోయింది.

తెలుపు అంతా ఒక్కచోటే పోగయినట్లు పశువుల పాక వెలిగిపోతూ వుంది.

ఆలోచనలతోనే మగతగా నిద్రకొరిగాడు జోసఫ్.

ఆశాజ్యోతికి, ఎవరో తట్టినట్లు మెలకువ వచ్చింది. 'జయా! జయా!' అంటూ చెల్లెల్ని తట్టింది. జయంతి ఏడుస్తూ నిద్రలేచింది.

ప్రక్కగదిలోంచి మేరీ పిల్లల అలికిడి వింది. అత్తతో చెప్పింది.

ఆ చెప్పటంలో మాతృవాత్సల్యం వుంది. నిద్రపుచ్చమనే అభ్యర్థన వుంది.

తన కొడుకు నిద్ర పాడయి పోతుందేమోననే తొందరతో ఆమె లేచి పిల్లల్ని సముదాయించబోయింది.

'క్రిస్మస్ తాత రాలేదు. ఇంకా రాలేదు.' వాళ్ళ గొడవ వాళ్ళది.

పిల్లలు మంచం దిగి, క్రిస్టమస్ ట్రీ దగ్గరకు

వెళ్ళారు. వాళ్ళతోపాటు అమ్మ, సువార్తమ్మ కూడా పోయారు.

పార్శిల్స్ కనిపించాయి. ఎవరిదివారు తీసుకున్నారు.

పెన్ను, బొమ్మల పుస్తకాలు, రిబ్బన్లు, స్వీట్స్ టిన్ చూసుకొంది ఆశాజ్యోతి. 'నావివే! నావే' ఆనందంతో పొంగిపోయింది.

పలకా రంగురంగుల బలపాలూ, గౌను, బిస్కట్లు తీసుకొంది జయంతి. 'నాకెన్నో చూడు' సంతోషించింది జయంతి.

చీరే, జాకెట్టూ చూచి తృప్తిపడింది సువార్తమ్మ.

బైబిల్ తీసుకొని కళ్ళ కద్దుకొంది అమ్మ.

జోసెఫ్ నిద్రపోతున్నాడు. మేరీ మెలకువగా వుండి కూడా వాళ్ళ ఆనందం పంచుకొనటానికి రాలేకపోయింది. మంచం మీదే వుంది.

కానుకలు పుచ్చుకున్న నలుగురు హృదయాలలో క్రిస్టమస్ ఫాదర్ ప్రేమమూర్తిగా నిలుస్తాడు.

పిల్లల గుండెల మీద ప్రేమాప్యాయతల ముద్రలు పడ్డాయి. అవి చెరిగిపోవు!

పిల్లలు తండ్రిని లేపబోయారు. 'వాడి నిద్ర పాడు చేయవద్దు. మీరు పడుకోండి. రేపు మీ కానుకలు చూపెట్టవచ్చులే!' అని నాన్నమ్మ చెప్పింది.

కొంచెం సేపటికి పిల్లలు నిద్రపోయారు.

మేరీ గదిలోంచి కలకలం వినిపించి, తగ్గిపోయి, మళ్ళీ వినిపించింది.

జోసెఫ్ మంచం మీద అటూ ఇటూ కదిలాడు.

కలో, ఆలోచనో అతని మనస్సులో కదులుతూ వుంది. నిద్రలో ఉన్న అతని కళ్ళకు కనిపిస్తూ వుంది.

పాకలో పశువుల తొట్టిలో మేరీ పడుకొని వుంది.

ఆమె బాధతో అరుస్తూ వుంది. ఆదరాబాదరాగా తిరుగుతున్నాడు భర్త జోసెఫ్.

'అమ్మా!' అని అరిచింది మేరీ!

పాకలో ఉన్న అందరూ ఆమె చుట్టూ చేరారు.

'అమ్మా!' మేరీ నొప్పులు పడుతూ వుంది.

# శ్రీ కిరణ్

జనాభా లెక్కలలో వ్రాయబడటానికి బెత్లహేమ్ వచ్చిన మేరీ జోసఫ్‌లతో పాటు మరో కొత్త ప్రాణి కూడా ఆ లెక్కల్లో వ్రాయబడే అవకాశం దగ్గర పడుతూ వుంది.

ప్రక్కగదిలో మంచం మీద వున్న మేరీ 'అమ్మా!' అని అరిచింది.

నిద్రలో మునిగి వున్న జోసఫ్ ఆ అరుపు వినలేదు.

పశువుల పాకలో చివరిసారిగా మేరీ 'అమ్మా!' అంది. అంతలో పసిబిడ్డ గొంతు 'కేర్' మని వినిపించింది.

ఒక్కసారిగా పాక అంతా వెలుగులతో నిండిపోయింది. కేంద్రం మేరీ తనయుడు. జగద్రక్షకుడు. క్రీస్తు. ఏసుక్రీస్తు. అక్కణ్ణుంచి వలయాలు తిరుగుతూ వెలుతురు ప్రవహిస్తూ వుంది.

దేవదూత తెలిపిన ఆనవాలుతో గొర్రెల కాపరులు వచ్చారు. కీర్తనలు పాడారు. ఏసుక్రీస్తుకు భక్తితో నమస్కరించారు.


నక్షత్రం చూపిన త్రోవలో జ్ఞానులు వచ్చారు. కానుకలు సమర్పించారు. జగద్రక్షకుణ్ణి స్తుతించారు.

జోసఫ్ ఇంటినిండా జనం పోగయ్యారు. వీధిలోంచి కారెల్ పార్టీ వాళ్ళు పాటలు పాడుకొంటూ వస్తున్నారు. తెల్లవారు జామున నాలుగయింది.

దూరంగా వీధిలోంచి పాట వినబడుతూ వుంది మనోజ్ఞంగా శ్రావ్యంగా, అవ్యక్త మధురంగా.

తల్లి వచ్చింది. కొడుకును లేపింది. జోసఫ్ మంచం మీద కూర్చున్నాడు.

'కారెల్ పార్టీ వస్తూవుంది. నీకు కొడుకు పుట్టాడు.'




తల్లి చెప్పింది. గబగబా లోపలికి వెళ్ళిపోయింది.

విని, విషయం అర్థం చేసుకొనేసరికి, వీధిలోంచి పాట.

"వింతలేదిక ఏసు పుట్టెను
వింతగను బెత్లెహేమందున
చెంత చేరగ రండివేగమె"

వేగంగా మంచం మీంచి లేచాడు జోసఫ్. మేరీ వున్న గదిలోకి వెళ్ళాడు. చుట్టుప్రక్కల ఇళ్ళ ఆడవాళ్ళు అక్కడ చేరివున్నారు.

భార్య ఉన్న గది, బెత్లెహేమ్‌లో క్రీస్తు పుట్టిన పశువుల పాకలాగా అనిపించింది.

క్రొవ్వొత్తులతో, విద్యుద్దీపాలతో, వెలిగిపోతున్న ఇల్లు పశువుల పాకలో క్రీస్తు చుట్టూ వలయాలు తిరుగుతున్న వెలుతురులాగా వుంది.

కారెల్ పార్టీ వాళ్ళు పాటలు పాడుకొంటూ ఇంటి ముందుకు రాగానే, గొర్రెల కాపరులు, జ్ఞానులు, జోసఫ్ హృదయంలో మెదిలారు.

'సుఖ ప్రసవం. ఏం కష్టంలేదు.'

పొరుగామె చెప్పింది.

'మగబిడ్డ! తల్లీబిడ్డ క్షేమం!'

మరొకామె పలికింది.

'శ్రీకరుడి కృపరా తండ్రీ! ఇవాళ నీకు కొడుకు పుట్టాడంటే నువ్వెంతో పుణ్యం చేసుకొన్నావురా.'

కొడుకును దీవించింది తల్లి!

'శ్రీకరుడు, శ్రీకరుడు', అనుకొన్నాడు జోసఫ్.

పశువుల పాకలో, బెత్లహేమ్ పట్టణంలో ఎప్పుడో పుట్టినా, ఇప్పుడే పుట్టినట్లున్న, ఏసుక్రీస్తు కాంతితో వలయాలు తిరిగే వెలుగులోంచి ఒక కిరణం దేశదేశాలు దాటుతూ, ఆంధ్రదేశంలో తన యింటిలో ప్రవేశించినట్లు అనిపించింది.

'కిరణం! కాంతి కిరణం' అనుకొన్నాడు. 'శ్రీకరుడి కిరణం, శ్రీకిరణుడు, శ్రీకిరణం, శ్రీకిరణ్' అనుకొన్నాడు మళ్ళీ.

'శ్రీకిరణ్' నిశ్చయంగా అనుకున్నాడు.

'శ్రీకిరణ్ శ్రీకిరణ్ శ్రీకిరణ్' అనుకొంటూ ఆనందపారవశ్యంతో పసిగందును ముద్దు పెట్టుకున్నాడు.

'శ్రీకిరణ్' అనుకొంది మేరీ.

ఆశాజ్యోతి, జయంతితో తమ్ముడి పేరు 'శ్రీకిరణ్' అని చెప్పింది.

పెద్దపిల్ల తండ్రి దగ్గరకు వచ్చి 'నాన్నా! నాన్నా! క్రిస్మస్ తాత మాకెన్నో కానుకలిచ్చాడు. నీకూ అమ్మకూ ఏమీ ఇవ్వలేదా?'

'ఇచ్చాడు. ఇచ్చాడమ్మా! ఈ శ్రీకిరణ్‌ని ఇచ్చాడు.'

వెలుగుతున్న బల్బు మరీ కాంతిమంతంగా వెలిగినట్లు అయింది.

క్రిస్టమస్ ట్రీ క్రొత్త కాంతులు, రంగురంగులతో వెదజల్లుతూ వుంది.

ఇల్లంతా వెలుతురయింది.

దూరంగా చర్చి గంటలు వినబడుతున్నాయి. ●